కాంగ్రెస్ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలి

కేటీఆర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

- కేటీఆర్

అయిజ, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ సర్కారు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మోసాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్యను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో కేటీఆర్‌ను పల్లయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేటీఆర్‌తో చర్చించినట్లు పల్లయ్య తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు అహర్నిషలు కృషి చేయాలని సూచించాడని వెల్లడించారు. జిల్లాలో పార్టీ సా నుభూతిపరులను గెలిపించుకోవడంతోపాటు 13జెడ్పీటీసీలు, 13మండల పరిషత్‌లు, 4 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రచారం చేయాలని కేటీఆర్ చెప్పినట్లు పల్లయ్య తెలిపారు.

ప్రతిష్ఠాపనోత్సవ కరపత్రాలు విడుదల

ఆలయం వద్ద కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని బాలానగర్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ, దేవత విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కరపత్రాలను మంగళవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విడుదల చేశారు. అంతకు ముందు మాజీ మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గతంలో రోడ్ల విస్తరణలో భాగంగా ఆలయ పునర్‌నిర్మాణం చేపట్టగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రూ.5లక్షలు అందజేసి ఆలయ నిర్మాణానికి సహకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, అశోక్ , తిరుమల్, గిరి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్య, మురళి, ప్రభాకర్, బాలస్వామి, రవి, నీలస్వామి, ఎర్ర శ్రీను, వీరయ్యాదవ్, రవి సాగర్, మన్నెం, రాములు, శ్రీను, చిట్యాల రాము ఉన్నారు.

కార్మికుల భద్రత కోసం నేతన్న పొదుపు పథకం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 11 : చేనేత కార్మికుల సాంఘిక భద్రత కోసం నేతన్న పొదుపు పథకం ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాండురంగ స్వామి ఆలయంలో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నేతన్నకు పొదుపు పథకంపై చేనేత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించగా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత కార్మికులు ప్రతి నెలా రూ.2,200 చొప్పున రెండేండ్లు పొదుపు చేస్తే రూ.52,800 అవుతుందని రెండేళ్ల తర్వాత ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.1,56,000 చెల్లిస్తుందన్నారు. చేనేత కార్మికులకు చేయూత నివ్వడంలో భాగంగా కలెక్టర్, బ్యాంకర్స్‌తో మాట్లాడి మహిళా చేనేత కార్మికులకు రుణసదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చేనేత కార్మికులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో జౌళి, చేనేత శాఖ అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, ప్రియాంక, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, చేనేత కార్మిక సంఘాల నాయకులు అక్కలశ్రీనివాసులు, సురేశ్, శాంతారాం, సత్యనారాయణ, గోవిందు, కుర్మన్న, ధర్మనాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

హక్కులను ప్రజలు వినియోగించుకోవాలి

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: రాజ్యాంగం కల్పించిన హక్కులను అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బుడగ జంగాల కానీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కాలనీవాసులకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు మంచి గురువులుగా మారి భవిష్యత్‌కు మార్గదర్శకాలు కావాలని సూచించారు. అదేవిధంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , జడ్జి వి.రజిని మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఎల్ఏడిసిఎస్ ఉత్తరయ్య, సఖి లీగల్ కౌన్సిలర్ డి.కృష్ణయ్య, రూరల్ ఎస్సై బాలయ్య పాల్గొన్నారు.

మేధావులు, ఉపాధ్యాయులకు సన్మానం చేయడం గొప్ప వరం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11 : మేధావులు, ఉపాధ్యాయులకు సన్మానం చేయడం మాకు లభించిన గొప్ప వరమని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీశ్‌యాదవ్ అన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత గణిత అవధాని, రిటైర్డ్ టీచర్ అనంతప్ప యాదవ్‌ను, ప్రముఖ కార్టూనిస్టు రేపు రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి పురస్కారం పొందనున్న, రిటైర్డ్ టీచర్ శేషిరెడ్డిని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు మంగళవారంఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీశ్‌యాదవ్ మాట్లాడుతూ గణిత అవధానిగా పేరు తెచ్చుకున్న అనంతప్ప యాదవ్‌ను సన్మానించడం మా అదృష్టమన్నారు. అదేవిధంగా మీలో ఎవరు కోటీశ్వరుడు ప్రోగ్రాంతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ కార్టూనిస్టు, రిటైర్డ్ టీచర్ శేషిరెడ్డి రేపు రాష్ట్ర ప్రభుత్వం తరపున రవీంద్ర భారతిలో పురస్కారం అందుకుంటున్న సందర్భంగా వారిని కూడా ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్య వేదిక నాయకులు కొత్తగొల్ల శంకర్, వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి సతీశ్, యాదయ్య, శివకుమార్, మోహన్ గౌడ్, రాములు, వెంకటేశ్, నాగరాజు, రామస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ అనంతప్పయాదవ్, ప్రముఖ కార్టూనిస్టును సన్మానిస్తున్న ఐక్య వేదిక జిల్లా నాయకులు

రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11 : హైబ్రిడ్ యాన్యూటి మోడల్ ప్రోగ్రాం (హెచ్ఎంఏ) కింద జిల్లా కేంద్రం నుంచి హైవే రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి రోడ్డు, భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ కింద వనపర్తి– కొత్తకోట రోడ్డును కొత్తకోట వరకు నాలుగు వరుసల రోడ్డు, వనపర్తి నుంచి బిజినేపల్లి మీదుగా జడ్చర్ల రోడ్డు వరకు నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పెట్టాలని సూచించారు. అదేవిధంగా వనపర్తి పెబ్బేరు రోడ్డు, రాజనగరం నుంచి పెద్దమందడికి ఉన్న రోడ్డును రెండు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి గ్రామ పంచాయతీ నుంచి మండలానికి బీటీ రోడ్డు అనుసంధానం లేదని పెబ్బేరు మండలం రాంపూర్ నుంచి రామమ్మపేట, కనిమెట్ట నుంచి పాత జంగమాయిపల్లి వరకు 7.30 కి.మీ రోడ్డును బీటీగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలకు ఉన్న రోడ్లను మరింత మెరుగుపర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో రోడ్డు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ దేశ్యనాయక్, పంచాయతీ రాజ్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, డీఈలు సీతారామస్వామి తదితరులు ఉన్నారు.

కంటిచూపు సరిగ్గా ఉన్నప్పుడే చదువుపై దృష్టి కేంద్రీకరించొచ్చు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: విద్యార్థులకు కంటిచూపు సరిగ్గా ఉన్నప్పుడే చదువుపై దృష్టి కేంద్రీ కించగలరని, అందుకోసమే విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, కంటిచూపు సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి చూపు సరిగా లేకపోతే చదువుపై దృష్టి కేంద్రీకరించక , పరీక్షల్లో రాణించలేరన్నారు. అందుకే జిల్లాలోని 300 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 30వేలకు పైగా మంది విద్యార్థులకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో 2వేల మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అందులో 946మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11 : ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రావుల గిరిధర్, అనదపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, తాసీల్దార్లతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలో 12 ఇసుక రీచ్‌లు ఉన్నాయని, గృహ నిర్మాణాలు చేపడుతున్న జిల్లా ప్రజలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇసుకను ఇంటివద్దకు సరఫరా చేస్తున్నామన్నామని చెప్పారు. మన ఇసుక వాహనం ద్వారా కాకుండా రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలించి అధిక ధరకు అక్రమం గా రవాణా చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాసీల్దార్లు, ముగ్గురు పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బృందాలు రాత్రి, పగలు చూడకుండా రీచ్‌లపై తనిఖీలు నిర్వహించాలని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి యజమానిపై కేసు బుక్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ద్వారా ట్రాక్టర్ పట్టుకుంటే రూ.500, టిప్పర్ పట్టుకుంటే రూ.1000 బహుమానంగా ఇస్తానని ప్రకటించారు. ప్రతి మన ఇసుక వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం పెట్టాలని, ఒక ట్రిప్ బుక్ చేసుకొని అంతకు మించి ఇసుక తరలించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అలాంటి వాహనాలను సైతం సీజ్ చేయాలన్నారు. పెబ్బేరు మండలం రామన్నపేట , వీపనగండ్ల మండలం తూంకుంట రీచ్‌లను నుంచి ఎక్కువగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ వ్యాపారంపై ఉక్కుపాదం మోపేందుకు పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని, రెవెన్యూ అధికారుల తో కలికట్టుగా పనిచేసి ఎక్కడి ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సీఐలు , స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, తాసీల్దార్లు , మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

తక్కువ ధరకే ఇసుక ఇస్తాం

జిల్లాలో గృహ నిర్మాణాలు చేపడుతున్న ప్రజలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇసుక ఇస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం ప్రకటనలో తెలిపారు. .http://tsmiv.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా తన ఫోన్ నెంబర్‌తో లాగిన్ అయి అవసరమైన మేరకు మన ఇసుక వాహనం ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. ఇసుక రీచ్ సమీప దూరాన్ని బట్టి రూ.1,750 నుంచి గరిష్ఠంగా రూ.3,750 వరకు ఇసుక ఇంటివద్దకే డంప్ చేస్తారని తెలిపారు. జిల్లా ప్రజల అవసరార్థం 12 రీచ్‌ల ద్వారా ఇసుకను మన ఇసుక వాహనం ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

మాట్లాడుతున్న గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, ఫిబ్రవరి 11: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధులు నిర్వర్తించనున్న రిటర్నింగ్ అధికారులకు రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన ట్రైనర్లతో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరి పాటిస్తూ ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రీయా శీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా ని బంధనలకు అనుగుణంగా ప్రతి అధికారి పూర్తి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు బ్యాలెట్ పత్రాల ద్వారా జరగనున్న నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ నుంచి నామినేషన్ల స్వీకరణ, స్క్రూటీని, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్ కౌంటింగ్ వరకు ప్రతి దశలో రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థికి పూర్తి

- కలెక్టర్ సంతోష్

అవకాశం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నోటిఫికేషన్ జారీ చేసిన తక్షణమే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావాలని, అభ్యర్థులు ఎన్ని నామినేషన్లు సమర్పించినా వాటిని పూర్తిగా పరిశీలించి ఆమోదించినవి, తిరస్కరించినవి తిరస్కరణకు గల కారణాలు స్పష్టంగా ప్రకటించాలని ఆదేశించారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడానికి అతడితో పాటు ప్రతిపాదకుడు మరో వ్యక్తి కలిసి గరిష్ఠంగా ముగ్గురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి గదిలో ప్రవేశం కల్పించాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలో సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, అధికారులు నాగేంద్రం పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

- ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 11 : జిల్లా పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ తోట శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో అదేశించారు. ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో దాడులు చేసి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

తాత్కాలికంగా రిలే దీక్ష విరమణ

రాజోళి, ఫిబ్రవరి 11: ఇథనాల్ కంపెనీ ఏర్పాటును రద్దు చేయాలని 20రోజులుగా చేపడుతున్న రిలే దీక్షను తాత్కాలికంగా మంగళవారం విరమించారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఇథనాల్ కంపెనీని రద్దు చేయిస్తానని హామీ ఇవ్వడంతో వారు దీక్షను విరమించారు. దీక్ష చేపట్టిన వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. సహకరించిన ప్రజాప్రతినిధులు, ప్రజారసంఘాలు, పత్రికలకు ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దస్తగిరి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కుమార్, సీఐ టాటాబాబు, తాసీల్దార్ రామ్మోహన్, ఎస్సై జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్, ఫిబ్రవరి11: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారినిఅరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్వేరోస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధర్మపరిరక్షణ పేరిట ఆలయ అర్చకులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో అందరి అభిప్రాయాలు గౌరవించాలని, బలవంతపు చర్యల ద్వారా ఏ ధర్మం కాపాడదని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటర్‌నెట్‌పై అవగాహన

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11 : ఇంటర్‌నెట్‌ను వినియోగించడంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వనపర్తి నేషనల్ ఇన్ఫర్మెటిక్ సిబ్బంది వెల్లడించారు. మంగళవారం అంతర్జాతీయ సేఫ్ ఫర్ ఇంటర్నెట్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఐసీ సిబ్బంది మురళీకృష్ణ, సంధ్యారాణి, శ్రవణ్‌కుమార్, విజయ్‌కుమార్ ఉన్నారు.

క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల, జెడ్పీ సెంటర్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ప్రతి మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నర్సింగరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు సంబంధించి నూతన, రెన్యువల్ సర్టిఫికెట్ల కోసం మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. హాజరైన వారికి అదే రోజు సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. 12,19 తేదీల్లో శారీరక వికలత్వం, మానసిక వికలత్వం గల వారికి,18, 25 తేదీల్లో కంటి, శారీరక, మానసిక వికలత్వం వారికి,14, 21, 28 తేదీల్లో చెవిటి,మూగ వారికి క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

13న సమావేశం

పాన్‌గల్, ఫిబ్రవరి 11: మండలంలోని వివిధగ్రామాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ సంబంధించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదా వివరాలు తెలిపేందుకు గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపాల్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపా రు. ఓటర్ల జాబితాలు, వాటికి అనుగుణంగా పోలింగ్ కేం ద్రాల ఎంపికకుగాను ముసాయిదాను సిద్ధం చేశారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలిపేందుకుగాను రాజకీయ నా యకులు, ప్రజలనుంచి మంగళవారం నుంచి ఈనెల 13వరకు అభ్యంతరాలు స్వీకరించుట, 14న అభ్యర్థనల పరిశీలన, నివృత్తి, సలహాలు స్వీకరించుట, కలెక్టర్‌కు నివేదించుట, 15న పైనల్ పోలింగ్ స్టేషన్లు ప్రచురించుట తదితర కార్యక్రమాలు చేపడుతారని ఎంపీడీవో తెలిపారు.

జిల్లా స్థాయి సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11 : జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని 15మండలాల నుంచి 50 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఇందులో తిప్పుడంపల్లి జెడ్పీహెచ్ఎస్ చెందిన నిఖిల్ ప్రథమ స్థానం, వనపర్తికి జెడ్పీహెచ్ఎస్ చెందిన మనోజ్ ద్వితీయ స్థానం, వీపనగండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఉదయ్‌కిరణ్ తృతీయ స్థానం, బలిజపల్లి జెడ్పీహెచ్ఎస్ చెందిన గణేశ్ తృతీయ స్థానంలో నిలిచి బహుతులు అందుకున్నారు. బహుమతులు అందజేసిన వారిలో జిల్లా పరీక్షల విభాగాదిపతి గణేశ్, మానిటరింగ్ విభాగాధిపతి చంద్రశేఖర్, సెక్టోరియల్ అధికారి మహానంది, జీహెచ్ఎం గురురాజు, వేణుగోపాల్‌రెడ్డి, వీణాచారి పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 11: ఇంటి వద్ద చీపురుతో ఊడుస్తుండగా మహిళ మెడలో గొలుసును దొంగలు తెంపుకొని పారిపోయిన ఘటన శాంతినగర్‌లో పట్టపగలు చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన గోపాల్‌రావు భార్య రత్నకుమారి మంగళవారం ఉదయం 7గంటలకు ఇంటి పరిసరాలు ఊడుస్తుండగా, ఇద్దరు యువకులు వచ్చి ఆమెను అడ్రస్ అడిగినట్లుగా.. నటించి మెడలోని రెండు తులాల గొలుసును తెంపుకొని బైక్‌పై పారిపోయారు. మహిళ కేకలు వేయగా.. భర్త గోపాల్‌రావు వచ్చేలోగా వారు కర్నూల్ వైపుగా పారిపోయారు. ఈ విషయమై వారు శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 11: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎస్సై కథనం మేరకు గద్వాల మండలంలోని కాకులారం గ్రామంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వీరేశ్, రాజు అనే ఇద్దరు వ్యక్తులు మంగళవారం అక్రమంగా కర్ణాటక లోని రాయిచూర్‌కు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రేషన్ బియ్యం తరలించే వాహనాన్ని గుర్తించి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసి రేషన్ బియ్యాన్ని , వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

గడ్డి వాము దగ్ధం

గోపాల్‌పేట, ఫిబ్రవరి 11 : గడ్డి వాము దగ్ధమైన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలకేంద్రంలో రైతు గోకారం నర్సింహ ఇంటి సమీపంలో గడ్డిని నిల్వ చేసుకున్నాడు. మంగళవారం ప్రమాదవశాత్తు గడ్డివాము అంటుకొని మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇవ్వగా అది వచ్చే లోపే గడ్డివాము కాలి బూడిదైంది. గడ్డి విలువ రూ. 20 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

భక్తుల నిలువు దోపిడీ

- టెంకాయ ధరలను పెంచిన టెండర్‌దారుడు

గద్వాల రూరల్,ఫిబ్రవరి 11 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. జములమ్మ పుట్టినింటి నుంచి వచ్చిన తర్వాత మొదటి మంగళవారం కావడంతో ఇతర రాష్ట్రాల నుంచే కాక పలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇదే అదునుగా భావించిన టెంకాయ టెండర్‌దారుడు భక్తులను నిలువునా దోపిడీ చేస్తున్నాడు. రూ.30లకు అమ్మాల్సిన టెంకాయను రేటు పెంచి రూ.50లకు అమ్ముతూ , ఆలయంలో రెండు కొబ్బరి కాయలు కొట్టాలని భక్తులతో రూ.100 వసూలు చేస్తున్నాడు. అదేవిధంగా ఆలయం ముందు కొందరు మహిళలు భక్తుల చేతిలోని టెంకాయలను లాక్కొని కొట్టి డబ్బులు వసులు చేస్తున్నారు. అలాగే బొట్టు పెట్టి డబ్బులు ఇవ్వమని బలవంతం చేస్తున్నారు.

స్తంభించిన ట్రాఫిక్..

ట్రాఫిక్ సమస్య భక్తులకు మరింత చికాకు తెప్పించింది.ట్రాఫిక్ క్లియ